వేంకటేశ్వరస్వామికి పల్లకీ సేవ



అల్వాల్: ఓల్డ్ అల్వాల్‌లోని బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం ఆలయ వంశపారపర్య చైర్మన్ రాజాగోపాల్ సైన్బర్, ఈవో వీరేశం నేతృత్వంలో స్వామివారిని పల్లకి సేవలో పురవీధుల్లో ఊరేగించారు. యజ్ఞాచార్యులు విజయసారథి, అర్చకులు రఘు, శ్రీనివాస్, రమణ, సిబ్బంది వెంకట్‌రెడ్డి, స్వామి, శ్రీకాంత్, రాజు, సేవకులు వెంకటరామిరెడ్డి, శివరామ కృష్ణ, రామచంద్రరావు తదితరులున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న కార్పొరేటర్ శ్రీదేవి

కుషాయిగూడ: సీఎం రిలీఫ్‌ఫండ్ పేదల పాలిట వరమని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. చర్లపల్లి డివిజన్, అనారోగ్యం బారిన పడ్డ బీఎస్‌రెడ్డినగర్‌కు చెందిన క్యాబ్‌డ్రైవర్ సదానంద్ కుమార్తె శిల్ప కుటుంబసభ్యులకు సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి మంజూరైన రూ. లక్ష చెక్కును అందజేశారు. అత్యవసర పరిస్థితుల్లో పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఇది దోహదపడుతుందని, అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సంప్రదాయాలు పరిరక్షించుకోవాలి



కార్యక్రమంలో విద్యాధికారి జ్యోతి, విద్యార్థులు

అల్వాల్: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మల్కాజిగిరి మండల విద్యాధికారి జ్యోతి అన్నారు. భారతదేశ చరిత్రలో మహనీయులను స్మరిస్తూ దేశ సంస్కృతి, సాంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాలనే ఉద్దేశంతో అల్వాల్‌లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 'భారతీయం' పేరుతో కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. డీఎంఈవో రవీందర్‌రాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సంధ్యారాణి, బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన



న్యూ రాఘవేంద్రనగర్ కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ శాంతి

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని న్యూ రాఘవేంద్రనగర్ కాలనీలో గురువారం జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి నాచారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్ పర్యటించారు. డ్రైనేజీ, సీసీ రోడ్ల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆర్‌ఎస్. తిరుమల టవర్ నుంచి శాంతి గార్డెన్స్ వరకు నిధులు మంజూరైనా.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు పెండింగ్ ఉన్నాయన్నారు. నిధులు మంజూరు చేయించి పూర్తిస్థాయిలో డ్రైనేజీ, సీసీరోడ్లను వేయిస్తామని కాలనీవాసులకు కార్పొరేటర్ హామీ ఇచ్చారు. కార్పొరేటర్ డీఈ బాలకృష్ణ, ఏఈ కీర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్‌కు వాటర్ ఫిల్టర్ అందజేత



కాప్రా: కాప్రా ప్రెస్‌క్లబ్‌కు మాజీ కార్పొరేటర్ పావనీరెడ్డి వాటర్ ఫిల్టర్‌ను అందజేశారు. ఆమె భర్త మణిపాల్‌రెడ్డి జయంతి సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆమె మాట్లాడుతూ.. ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి మణిపాల్‌రెడ్డి ఎంతో కృషి చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆయన స్మారకంగా అదనపు గది కూడా నిర్మించినట్లు చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని సేవాకార్యక్రమాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కాప్రా ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు శ్రీనివాస్, శంకర్, నర్సింగ్‌గౌడ్, విజయ్‌కుమార్, గోపాల్, కేసీ మోహన్, సహదేవచారి, భాస్కర్‌రెడ్డి, బాల్‌రాజు, బాల్‌రెడ్డి, రమేష్, నాయకులు వంజరి ప్రవీణ్, రమాదేవి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

మేడిపల్లి: రాష్ట్రంలోని అర్హులైన నిరుపేదలకు ఉచిత విద్య, వైద్యం అందించడంతో పాటు ఇళ్లు, భూమి అందించి ఉపాధి అవకాశాలను కల్పించాలనే డిమాంతో ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో మేడిపల్లి మండల తహసీల్దార్ ఆఫీస్ వద్ద రిలే నిరాహార దీక్షలు 4వ రోజుకు చేరాయి. 5 డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వినతిపత్రాన్ని మేడిపల్లి మండల తహసీల్దార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా మేడిపల్లి మండల కన్వీనర్ పారునంది వెంకేర్ మాట్లాడుతూ.. పేదలకు ఉచిత విద్య, వైద్యం, భూమి, ఇళ్లతో పాటు ఉపాధి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ధర్మ సమాజ్ పార్టీ మేడిపల్లి మండల కో - కన్వీనర్ కుమార్, మేడ్చల్ జిల్లా కో - కన్వీనర్ శివకుమార్, ప్రవీణ్‌కుమార్, బాబు తదితరులు పాల్గొన్నారు.

మీ సేవా నిర్వాహకుల నూతన కార్యవర్గం

మల్కాజిగిరి: మల్కాజిగిరి మండల మీ సేవ నిర్వాహకుల సంఘం నూతన కార్యవర్గం గురువారం నేరేడ్‌మెట్ అంబేడ్కర్ భవన్‌లో ఎంపిక జరిగింది. సంఘం అధ్యక్షుడిగా రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నరేష్, సహాయ కార్యదర్శిగా జయశ్రీ, కోశాధికారిగా మధుసూదన్, కార్యనిర్వాహక కార్యదర్శిగా మల్లికార్జున్, సభ్యులుగా నవీన్, అనీల్, ప్రదీప్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సునీల్‌రెడ్డి, సాయి, కన్యాకుమారి, మాధవి, చంద్రకాంత్, ప్రమోద, జమున పాల్గొన్నారు.

ముమ్మరంగా ఆక్రమణల తొలగింపు

- పాదచారులు, వాహనదారులకు తప్పనున్న కష్టాలు
- హౌజింగ్ బోర్డు కాలనీ రోడ్డులో పైప్‌లైన్ పనులు ప్రారంభం
- తొలగింపులను దగ్గరుండి పర్యవేక్షించిన కమిషనర్, చైర్‌పర్సన్



అంబేడ్కర్ విగ్రహం రోడ్డులో.. ఆక్రమణలను తొలగిస్తున్న జేసీబీ

మేడ్చల్: మేడ్చల్ మార్కెట్‌లో వాహనదారులు, పాదచారుల కష్టాలను తీర్చేందుకు మున్సిపల్ అధికారులు చేపట్టిన ఆక్రమణల తొలగింపు గురువారం కూడా కొనసాగింది. నాలుగు రోజులుగా మార్కెట్ రోడ్డులో ఆక్రమణలను తొలగిస్తూ విస్తరణ పనులు చేపట్టారు. ప్రధానంగా మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, చైర్‌పర్సన్ నర్సింహారెడ్డి, టీపీఎస్ రాధాకృష్ణ, డీఈ విజయలక్ష్మి దగ్గరుండి ఆక్రమణలు గుర్తించి తొలగింప చేస్తున్నారు. వివేకానంద విగ్రహం నుంచి ఇందిరా గాంధీ విగ్రహం వరకు, రైతు బజారు నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు రోడ్డుపై ఏర్పాటు చేసుకున్న వ్యాపారాలను తొలగింప చేశారు. పూలు, పండ్లు ఇతర చిరు వ్యాపారులకు రైతు బజారు వద్ద స్థలాలు కేటాయించి అక్కడ వ్యాపారాలు చేసుకునే వీలు కల్పించారు. చిరు వ్యాపారుల ముసుగుతో పెద్ద షాపుల యజమానులు రోడ్డు స్థలాన్ని ఆక్రమించుకుని తమ దుకాణాల ముందు షెడ్లు వేసుకుని వ్యాపారాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ అధికారులు ఆ విషయాలను గుర్తించి దుకాణాల ముందు అక్రమంగా నిర్మించుకున్న షెడ్లను, మెట్లను, ర్యాంపులను పూర్తిగా తొలగించి రోడ్డును విశాలంగా ఏర్పాటు చేశారు. రెండు రోజుల క్రితం వివేకానంద విగ్రహం నుంచి చౌరస్తా వరకు విస్తరణ పనులు పూర్తి చేయగా గురువారం అంబేడ్కర్ విగ్రహం నుంచి రైల్వే స్టేషన్ రోడ్డు ఆక్రమణలను తొలగించారు. గతంలో వివాస్పదాలతో ఆగిన రైల్వే స్టేషన్ విస్తరణ పనుల జోలికి అధికారులు వెళ్ళకుండా కేవలం ఆక్రమణలను తొలగించి రోడ్డు విస్తరించారు.

చురుగ్గా యూజీడీ పనులు..

మార్కెట్ రోడ్డు విస్తరణ పనులతో హౌజింగ్ బోర్డు కాలనీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. తుమ్మ చెరువులో మురికి నీరు చేరుతుండడంతో మురుగు నీరు చెరువులోకి చేరకుండా యూజీడీ పైప్‌లైన్ నిర్మాణంకు ప్రభుత్వ పెద్దలు శంకుస్థాపన చేయడం నిధులు మంజూరు కావడంతో పనులు చకచకా సాగుతున్నాయి. మున్సిపల్ అధికారులు వివేకానంద విగ్రహం వద్ద హౌజింగ్ బోర్డును బారికేడ్లు ఏర్పాటు చేసి మూసివేశారు. రద్దీ రోడ్డు మూసి వేయడంతో పట్టణంలో తిరిగే వాహనదారులకు ఇబ్బందులు లేకుండా మార్కెట్ రోడ్డులో ఆక్రమణలను తొలగించి విస్తరించి కొద్ది మేరకు ట్రాఫిక్ సమస్యను తీర్చారు. విస్తరణ పనులు పూర్తయితే రోడ్లు మరింత విశాలంగా మారే అవకాశాలున్నాయి.

ప్రారంభమైన రాజకీయాలు..

మార్కెట్ రోడ్డులో ఆక్రమణలను తొలగించి రోడ్డును విశాలంగా మారుస్తుండటంతో రాజకీయాలు ప్రారంభమయ్యాయి. ఆక్రమణదారులకు ముందస్తు సమాచారం ఇవ్వలేదని, చట్ట ప్రకారంగా నోటీసులు ఇవ్వలేదని, ఎలా కూల్చివేస్తారని కొంతమంది కొన్ని పార్టీల నాయకులు రాజకీయాలు చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. అక్రమణలు తొలగితే అందరికి మేలు కలుగుతుందని తెలిసినా.. కేవలం రాజకీయాల కోసం వాతావరణాన్ని వేడి చేసే ప్రయత్నాలు చేస్తున్నారు.



మార్కెట్ రోడ్డులో.. అధికారులు తొలగించిన దుకాణాల ముందున్న మెట్లు



చురుకుగా హౌజింగ్ బోర్డు రోడ్డులో పైప్‌లైన్ నిర్మాణం

గొర్రెల పెంపకందారుల సమస్యలను పరిష్కరించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న గొర్రెల పెంపకందారుల సంఘం సభ్యులు

మేడ్చల్: జిల్లాలో గొర్రెల పెంపకందారుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ జిల్లా గొర్రెల పెంపకందారుల సంఘం సభ్యులు జిల్లా కలెక్టర్‌ను కోరారు. సంఘం సభ్యులు ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. దళారీల ప్రమేయం లేకుండా 2వ విడత నగదు బదిలీ చేయాలని, ప్రభుత్వం గొర్రెలకు ఉచితంగా ఇన్సురెన్స్ చేయించాలని, గొర్రెల కాపరులకు పింఛన్ ఇవ్వాలని, ప్రమాదంలో చనిపోయే కాపరులకు రూ.10 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం సమర్పించిన వారిలో సంఘం సభ్యులు వెంకటేష్, కొమురయ్య, కుమార్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి చాక్లెట్ల పట్టివేత



పోచారం: బోడుప్పల్, గౌతంనగర్‌లో గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న వ్యక్తిని ఎస్‌టీఎఫ్ బృందం గురువారం అదుపులోకి తీసుకుంది. బీహార్ నుంచి గంజాయి చాక్లెట్లను తీసుకొచ్చి అమ్ముతున్నట్లు పోలీసులు అదుపులో ఉన్న వీరేంద్ర పాండే ఒప్పుకున్నాడు. ఒక్కో చాక్లెట్‌ను రూ. 15 చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిసింది. నిందితుడిని అదుపులోకి తీసుకోవడంతో పాటు 4.957 కేజీల గంజాయి చాక్లెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

కార్మికులకు రెండు పూటల పని విధానం రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రవిచంద్ర

ఘట్‌కేసర్: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు రెండు పూటల పని విధానం రద్దు చేయాలని తెలంగాణ మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రవిచంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని మహిళా సంక్షేమ భవనం వద్ద రాంచందర్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, అవుట్ సోర్సింగ్ విధానం రద్దు చేసి రూ. 26 వేలు కనీస వేతనం చెల్లించాలని కోరారు. మున్సిపాలిటీలో విలీనమైన పంచాయతీ కార్మికులకు, మున్సిపల్ కార్మికుల విధానాలు, ఈఎస్ఐ,పీఎఫ్ అమలు చేయాలన్నారు. మున్సిపల్ యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా ఈశ్వర్, ఉపాధ్యక్షులుగా సువర్ణ, శ్రావణి, శోభ, భూపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీరాములు, ప్రధాన కార్యదర్శిగా రాంచందర్, సహాయ కార్యదర్శులుగా రాంకుమార్, గణేష్, నగేష్, కోశాధికారులుగా అరుణ, ఆర్గనైజర్స్‌గా లక్ష్మి, భారతమ్మ, సలహాదారులుగా మల్లేష్, నరసింహా, బాలయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జయచంద్ర, కార్మికులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో నర్సింహారెడ్డి కళాశాల విద్యార్థిని ప్రతిభ



విద్యార్థిని విశ్రుతను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తా చాటింది. కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో మొదటి సంవత్సరం చదువుతున్న విశ్రుత ఇటీవల ఇండియన్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో.. నగరంలో నిర్వహించిన జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొనగా 69 కేజీల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 2వ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి త్రిశూల్ రెడ్డి, కోశాధికారి త్రిలోక్‌రెడ్డి, డైరెక్టర్ మోహన్, ప్రిన్సిపాల్ లోకనాథం, వైస్ ప్రిన్సిపాల్ పురుషోత్తం ప్రసాద్, పీడీ వంశీ కృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

చిరు వ్యాపారులను వేధించడం సబబు కాదు



మార్కెట్‌లో బాధితులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

మేడ్చల్: రోడ్డు విస్తరణ పేరుతో మేడ్చల్ మార్కెట్‌లో చిరు వ్యాపారులను మున్సిపల్ అధికారులు ఇబ్బంది పెట్టడం సరికాదని బీజేపీ నాయకుడు సుదర్శన్‌రెడ్డి అన్నారు. గత నాలుగు రోజులుగా మేడ్చల్ మార్కెట్ రోడ్డు విస్తరణ పనులు చేపట్టి అందులోని ఆక్రమణలను మున్సిపల్ అధికారులు తొలగించారు. చిరు వ్యాపారులు తమ అడ్డాలు కోల్పోయి నిరాశ్రయులు కావడంతో స్థానిక బీజేపీ నాయకులతో కలిసి సుదర్శన్‌రెడ్డి మార్కెట్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ అధికారులు పోలీసులను అడ్డుపెట్టుకుని ఇష్టారాజ్యంగా ప్రవరిస్తున్నారని విమర్శించారు. వ్యాపారులకు అన్యాయం జరగకుండా బీజేపీ అండగా నిలబడుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆంజనేయులు, శ్రీకాంత్, సుధాకర్‌రెడ్డి,శ్రీనివాస్‌గౌడ్, హేమలతారెడ్డి, రాఘవరెడ్డి, అర్జున్,వంశీవిజయ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం





ప్రొఫెసర్లుగా నియమితులైన టీవీఎస్ఎన్ ప్రసాద్, సీతారామం

శామీర్‌పేట్: శామీర్‌పేట్‌లోని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయంలో ఇద్దరు సీనియర్ ప్రొఫెసర్లు నియమితులయ్యారు. 2025 జనవరి నుంచి ప్రారంభమయ్యే సెమిస్టర్‌కు గాను ఇద్దరు సీనియర్ ప్రొఫెసర్లు డాక్టర్ టీవీఎస్ఎన్ ప్రసాద్, డాక్టర్ సీతారామం నియమితులవ్వగా వారికి గురువారం యూనివర్సిటీ స్వాగతం పలికింది. ఈ సందర్భంగా వైస్ చాన్స్‌లర్ శ్రీ కృష్ణదేవరావు మాట్లాడుతూ.. ఇద్దరు సీనియర్ ప్రొఫెసర్ల నియామకం నల్సార్ విద్యా ప్రపంచానికి రాబోయే సంవత్సరాల్లో న్యాయశాస్త్రం, మానవ హక్కులు, పబ్లిక్ పాలసీ రంగాలలో బోధన మరియు పరిశోధన రంగాల వికాసానికి, అభివృద్ధికి తోడ్పడనుందన్నారు.

సీఎం కప్ విజేతలకు బహుమతుల అందజేత



కీసరలో.. విజేతలకు బహుమతులు అందజేస్తున్న నాగారం చైర్మన్ చంద్రారెడ్డి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీడీఓ వసంతలక్ష్మి

కీసర: నాగారం పురపాలక సంఘ పరిధిలోని సెరినిటీ స్కూల్ మైదానంలో నిర్వహించిన సీఎం కప్ విజేతలకు బహుమతులను చైర్మన్ కొకట్ల చంద్రారెడ్డి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ భాస్కర్ రెడ్డి, 15వ వార్డు కౌన్సిలర్ వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దమ్మాయిగూడ మున్సిపాలిటీలో విజేతలు..

దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీచైతన్య స్కూల్‌లో నిర్వహించిన సీఎం కప్ విజేతలకు చైర్‌పర్సన్ వసుపతి ప్రణీతా శ్రీకాంత్‌గౌడ్ బహుమతులను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ.. క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యానికి దోహదపడతాయన్నారు. కబడ్డీ బాలికల విభాగంలో మొదటి బహుమతిని పల్లవి స్కూల్, రెండో బహుమతిని శ్రీచైనత్య స్కూల్, కోకో బాలికల్లో ప్రథమ బహుమతిని పల్లవి స్కూల్, ద్వితీయ బహుమతిని సెయింట్ ఆంథోనీ స్కూల్, కబడ్డీ బాలుర విభాగంలో ప్రథమ బహుమతిని శ్రీచైతన్య స్కూల్, ద్వితీయ బహుమతిని పుడమి స్కూల్, కోకో బాలుర విభాగంలో ప్రథమ బహుమతిని పుడమి స్కూల్, ద్వితీయ బహుమతిని శ్రీచైతన్య స్కూల్ గెలుచుకున్నాయి. కార్యక్రమంలో కమిషనర్ నాగమణి, కౌన్సిలర్లు వసుపతి రమేష్, రామారం శ్రీహరిగౌడ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభు, టీచర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీఎం కప్ క్రీడా పోటీలు

మేడ్చల్: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మండల పరిషత్ ఆధ్వర్యంలో పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో సీఎం కప్‌ను ఘనంగా నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు వివిధ రకాల ఆట పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కోకో, కబడ్డీ, యోగా, అథ్లెటిక్స్, వాలీబాల్ తదితర క్రీడా అంశాల్లో పోటీలు నిర్వహించారు. మండలంలోని శ్రీరంగవరం, బండమాదారం, లింగాపూర్ జట్లు మండల స్థాయిలో విజేతలుగా నిలిచాయి. సమావేశంలో ఎంపీడీఓ వసంతలక్ష్మి, ఎంఈఓ రామాచారి, ఉపాధ్యాయులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ విజేతగా 13వ వార్డు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో రెండు రోజుల పాటు సాగిన సీఎం కప్ క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. మున్సిపల్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీలో మున్సిపల్ పరిధిలోని 15 జట్లు పాల్గొనగా.. ఫైనల్స్‌లో 13 వార్డు విజేతగా నిలువగా 1వ వార్డు రన్నర్‌గా నిలిచింది. విజేతలకు మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్ స్వామి, కౌన్సిలర్లు బహుమతులు ప్రధానం చేసి వారిని అభినందించారు. కార్యక్రమంలో 13వ వార్డు కౌన్సిలర్ మల్లిఖార్జున్ ముదిరాజ్, మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్ గౌడ్, డీఈ దుర్గాప్రసాద్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

సీఎం కప్ విజేతలకు బహుమతులు

పోచారం: అన్నోజిగూడలోని యాదాద్రి పార్కు వద్ద మున్సిపల్ స్థాయి నిర్వహించిన సీఎం కప్ విజేతలకు చైర్మన్ కొండల్‌రెడ్డి గురువారం బహుమతులు అందజేశారు. కబడ్డీలో ప్రథమ బహుమతిని చౌదరిగూడ, ద్వితీయ బహుమతిని కొర్రెముల జట్లు గెలుచుకున్నాయి. వాలీబాల్‌లో మొదటి బహుమతిని పోచారం, రెండో బహుమతిని కొర్రెముల జట్లు కైవసం చేసుకున్నాయి. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. యువకులు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ వీరారెడ్డి, కౌన్సిలర్లు సాయిరెడ్డి, రవీందర్, మేనేజర్ అంజన్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ బాల్‌రెడ్డి, పీఈటీలు తిరుమల్‌రెడ్డి, శివరాం, సునీత, మున్సిపల్ సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

శామీర్‌పేట్‌లో..

శామీర్‌పేట్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడాపోటీలు గురువారం శామీర్‌పేట్‌లో నిర్వహించారు. మజీద్‌పూర్‌లోని జైన్ హెరిటేజ్ కేంబ్రిడ్జి స్కూల్‌లో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రీడా పోటీలను మండల ప్రత్యేకాధికారి శంకర్ కుమార్ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. అనంతరం మండలంలో వివిధ గ్రామాలకు చెందిన క్రీడాకారులు పలు పోటీల్లో పాల్గొనగా అనంతరం విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. మండల స్థాయిలో గెలుపొందిన జట్లను జిల్లా పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మమతాబాయి, తహశీల్దార్ యాదగిరిరెడ్డి, ఎంఈఓ వసంత కుమారి, ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్, ఎంపీఓ వినూత్న, పాఠశాల ప్రిన్సిపాల్ స్వాతి భట్టాచార్య, పీఈటీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



దమ్మాయిగూడలో.. విజేతలకు బహుమతులు అందజేస్తున్న దమ్మాయిగూడ చైర్‌పర్సన్ వసుపతి ప్రణీత



అన్నోజిగూడలో.. విజేతలకు బహుమతులు అందజేస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి



శామీర్‌పేటలో..

అభివృద్ధి పనులు ప్రారంభం

బోడుప్పల్: దశల వారీగా సీసీ రోడ్ల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్‌లోని 3వ డివిజన్‌లో రూ. 89.50లక్షలతో, 6వ డివిజన్‌లో రూ. 37లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు పనులకు గురువారం టీపీసీసీ ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్‌యాదవ్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలకు మౌలిక వసతులైన తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుద్ధ్యం, విద్యుత్‌కు అధిక ప్రాధాన్యనిస్తున్నట్లు వివరించారు. ప్రారంభించిన పనులను త్వరితిగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిశోర్‌గౌడ్, కార్పొరేటర్లు కొత్త చందర్‌గౌడ్, బింగి జంగయ్యయాదవ్, కో- ఆప్షన్ సభ్యులు రంగ బ్రహ్మన్నగౌడ్, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొత్త ప్రభాకర్‌గౌడ్, నాయకులు కుర్రి శివశంకర్, కొత్త సుకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

సత్యదేవుని ఆలయ ఘటనపై విచారణ



విచారణ చేపడుతున్న అధికారులు

ఉప్పల్ : ఇందిరానగర్‌లోని రమాసహిత సత్యనారాయణస్వామి ఆలయంలో ఇటీవల అయ్యప్ప స్వాములకు ఆలయ ఫ్యామిలీ ఫౌండర్ సభ్యుడికి మధ్య జరిగిన వివాదాస్పద ఘటనల గురించి గురువారం రాష్ట్ర దేవాదాయశాఖ అధికారులు హాజరై విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా అయ్యప్పస్వాములు, స్థానికులు దేవాదాయశాఖ అధికారులకు జరిగిన విషయాన్ని వివరించారు. ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ కోట్ల నర్సింహారెడ్డి తాను ఎలాంటి తప్పులు చేయలేదని, దేవాలయానికి సంబంధించిన నీటిని వృధా చేయొద్దని మాత్రమే చెప్పానన్నారు. సమగ్ర విచారణ అనంతరం తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. దేవాదాయశాఖ సూపరింటెండెంట్ మోహన్, ఇన్‌స్పెక్టర్ ప్రణీత్‌కుమార్, ఈవోలు వీరేశం, భాగ్యలక్ష్మి, అంజయ్య, రవికుమార్, చంద్రమోహన్, శంకర్ పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220387